క్లుప్తంగా

సృజనాత్మకతను వెలికి తీసేందుకే బాలసభ


విద్యార్థుల ప్రదర్శన

కడ్తాల్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు బాలసభలు దోహదపడతాయని ప్రధానోపాధ్యాయుడు జంగయ్య అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బాలసభను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ బాలసభ ద్వారా మానసిక వికాసం, మనోధైర్యం పెంపొందుతాయని చెప్పారు. ఇందులో భాగంగా విద్యార్థులు డీఈఓ, ఎంఈఓ, ప్రిన్సిపాల్, నటులు, కళాకారులుగా వ్యవహరించి అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పల్లవి, రాధాకృష్ణారెడ్డి, శోభారాణి, కౌసల్య, బుచ్చమ్మ, వెంకటేశ్వర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


వాహనాలు తనిఖీ చేసున్న ఎస్‌ఐ నాగరాజు

మాడ్గుల: మాడ్గుల–మాల్ జాతీయ రహదారి చౌరస్తా వద్ద మంగళవారం ఎస్‌ఐ నాగరాజు పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారు నడిపే వారు సీట్ బెల్టు పెట్టుకోవాలని సూచించారు. వాహన పత్రాలను కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు. మద్యం తాగి డ్రైవింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సీఐ జగదీష్‌కు సన్మానం


సీఐని సన్మానిస్తున్న టీఎస్‌యూ నాయకులు

మాడ్గుల: నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ జగదీష్‌ను మంగళవారం తెలంగాణ స్టూడెంట్ యూనిట్ జిల్లా అధ్యక్షుడు కట్ట వెంకటేశ్ ఆధ్వర్యంలో పలువురు సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతలను పర్యవేక్షిస్తానని, చట్టాన్ని అతిక్రమించిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని చెప్పారు. కార్యక్రమంలో టీఎస్‌యూ నాయకులు నాగరాజ్, శివకృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


కమిటీ సభ్యులతో సీఐటీయూ నాయకులు

మాడ్గుల: మాడ్గుల మండల కేంద్రంలో ఆశ వర్కర్లు మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు మంగళవారం నూతన కమిటీకి సీఐటీయూ అమనగల్లు మండల కన్వీనర్ పెంటయ్య నియామకపత్రం అందజేశారు. కమిటీ అధ్యక్షురాలిగా రజిత, ప్రధాన కార్యదర్శిగా వెంకటమ్మ, కోశాధికారిగా రేణుకను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పరంగా ఆశ వర్కర్లకు అందాల్సిన ప్రయోజనాలు సమకూరే వరకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు నాటవేణి, శ్రీలత, మమత తదితరులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేకుంటే చర్యలు

డీసీపీ సునీతారెడ్డి


వాహనాల తనిఖీల్లో డీసీపీ సునీతారెడ్డి, సిబ్బంది

తుర్కయంజాల్: వాహనాలకు నంబర్ ప్లేట్‌లు, సరైన పత్రాలు లేకుండా తిప్పితే చట్టరిత్యా చర్యలు తప్పవని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి హెచ్చరించారు. నాకాబందీలో భాగంగా మంగళవారం సాయంత్రం ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధి మన్నెగూడ వద్ద పోలీసులు పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ వాహనాల పత్రాలను పరిశీలించారు. కాగా.. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని పలు వాహనాలు స్వాధీనం చేసుకుని, ఠాణాకు తరలించినట్లు సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపారు.

ముసురుతో లాభం లేదు

- చెరువులు, కుంటల్లోకి చేరని నీరు
- భూగర్భ జలాలు అంతంతే..
- భారీ వర్షాల కోసం రైతన్నల ఎదురుచూపు
- మండలంలో అత్యల్పంగా 9మి.మీ. వర్షపాతం నమోదు


కొద్దిపాటి నీటితో బోసిపోతున్న నక్కర్తమేడిపల్లి సాలీ చెరువు

యాచారం: రాష్ట్రంలోని చాలా ప్రాంతంలో భారీ వర్షాలు కురిసి చెరువులు, కుంటలు, జలాశయాలు కళకళలాడుతుండగా.. ఇబ్రహీంపట్నం డివిజన్‌లో ముసురు తప్పితే.. చెప్పుకోదగిన వానలు కురవలేదు. వాగులు వంకలు పారలేదు. మూడు నాలుగు రోజులుగా పట్నం డివిజన్ అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధి గ్రామాల్లో 36 మిల్లీ మీటర్ల, మంచాల మండలంలో 21.1 ఎంఎం, పట్నం మండలంలో 17.9 ఎంఎం వర్షపాతం నమోదు కాగా, యాచారం మండలంలో అత్యల్పంగా 9.0 ఎంఎం నమోదయింది.

వెలవెలబోతున్న చెరువులు

మండల పరిధి తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లోని అటవీ ప్రాంతంలో భారీ వర్షాలు కురిస్తే.. వరదలు పారి గొలుసుకట్టు చెరువులైన తాడిపర్తి బంధం చెరువు, కుర్మిద్ద పెద్ద చెరువు, నానక్‌నగర్ చెరువు, నక్కర్తమేడిపల్లి గ్రామంలోని సాలీచెరువు, ఊర చెరువు, తక్కళ్లపల్లి గ్రామం చెన్నరెడ్డి చెరువు, మల్కీజ్‌గూడ మగ్దుం ఆలీ చెరువు, చింతపట్ల లక్ష్మణ్ చెరువు, నల్లవెల్లి నల్లవెల్లి చెరువులు నిండి నల్లగొండ జిల్లా పరిధి మర్రిగూడ మండలంలోని పలు చెరువులు, కుంటల్లోకి నీరు చేరతాయి. కానీ భారీ వర్షాలు లేని కారణంగా.. బంధం, పెద్ద చెరువుల్లోకి నీరు చేరలేదు. అబ్దుల్లాపూర్‌మెట్, మంచాల మండలంలో పలు గ్రామాల చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చి చేరాయి. మంచాల మండలం అటవీ ప్రాంతంలో భారీ వర్షాలతో చెన్నరెడ్డిగూడ, బొడకొండ, లోయపల్లి గ్రామాల్లోని వాగులు, వంకలు పరుగులు తీస్తున్నాయి.

మెట్ట పంటలకు ప్రాణం

ముసురు వర్షాలు మెట్టపంటలకు ప్రాణం పోసినట్లేనని ప్రాంత రైతులు పేర్కొంటున్నారు. సీజన్ ప్రారంభంలో వర్షాలు లేక మెట్ట పంటలు అధికంగా సాగు చేయలేదు. ఆలస్యంగా కురిసిన వర్షాలతో యాచారం, మంచాల, పట్నం మండలాల్లోని పలు గ్రామాల్లో పత్తి, కందులు, మొక్కజొన్న, వరిని సాగు చేశారు. రోహిణి, మృగశిర కార్తెలో వరి నారు పోసినా.. వర్షాభావం నేపథ్యంలో భూగర్భ జలాలు అడుగంటి చాలామంది రైతులు వరి పంటను సాగుచేయలేదు. మూగజీవాలకు తాగునీటి ఎద్దడి నెలకొంది. ప్రస్తుత వానలతో చెరువులు, కుంటల్లోకి నీరు రాకపోయినా.. బోరుబావుల్లో కొంచెం భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని కర్షకులు చెప్పారు. ముసురుతో పత్తి పంట పూత నేలరాలి నష్టం కలిగిస్తుందని వాపోయారు. ఏది ఏమైనప్పటికీ.. ముసురుతో లాభం లేదని, భారీ వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండితే కాని.. భూగర్భజలాలు పెరిగే అవకాశం లేదని రైతులు వెల్లడించారు.

వరి సాగు కష్టమే



ముసురు వర్షంతో మెట్ట పంటలకు ప్రాణం పోసినట్లు అయింది. కానీ బోరుబావుల్లో భూగర్భ జలాలు పెరగలేదు. నీరు పుష్కలంగా ఉన్న సమయంలో పది ఎకరాల్లో వరి సాగుచేసే వాడిని. కాని నేడు ఎకరా కూడ సాగు చేయని పరిస్థితి ఉంది. భారీ వర్షాలు పడితేనే ఉపయోగం.

– కొంగళ్ల జోగిరెడ్డి, రైతు, నందివనపర్తి

నీరు కలుషితం కాకుండా చూడండి

ఎంపీఓ లక్‌పతినాయక్


తాగునీటిని పరీక్ష చేయిస్తున్న ఎంపీఓ

ఇబ్రహీంపట్నం: తాగునీరు కలుషితం కాకుండా గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మండల పంచాయతీ అధికారి లక్‌పతినాయక్ ఆదేశించారు. మంగళవారం ఆయన ముకునూర్ గ్రామాన్ని సందర్శించి, తాగునీటి పరీక్షలు చేశారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలు సీజన్ వ్యాధుల బారిన పడకుండా చూడాలని పేర్కొన్నారు. చెత్తా చెదారం పేరుకు పోకుండా, దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా పారిశుద్ధ్య పనులు విస్తృతం చేయాలన్నారు. ఈ సందర్భంగా తాగునీటి వాటర్ ట్యాంక్ వద్ద నీటిని సేకరించి, క్లోరినేషన్ పరీక్షలు చేశారు. పలు ఇళ్లలో నీటిని పరీక్షించి చూశారు. పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- జాగ్రత్తగా వాహనాలు నడపాలి
- మహేశ్వరం అడిషనల్ డీసీపీ సత్యనారాయణ


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

యాచారం: డ్రైవింగ్‌లో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మహేశ్వరం అడిషనల్ డీసీపీ సత్యనారాయణ హెచ్చరించారు. మంగళవారం యాచారం మండల కేంద్రంలోని సాగర్ రోడ్డుపై ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజుతో కలిసి ఆయన పలు వాహనాలను తనిఖీలు చేశారు. వాహనాల పత్రాలను పరిశీలించారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని పది బైక్‌లను స్వాధీనం చేసుకుని, డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. డ్రైవింగ్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నింబంధనల ప్రకారం లైసెన్సులు కలిగి ఉండాలని, అతి వేగంగా ప్రయాణించి ఎదుటి ప్రాణాలకు ముప్పు తెవద్దని, ప్రమాదంలో పడొద్దని హెచ్చరించారు. సోదాల్లో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ నర్సింహరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బస్టాండ్‌లో బెంచీల ఏర్పాటు

ఆమనగల్లు: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం సంస్థ మంగళవారం స్టీల్ బెంచీలను ఏర్పాటు చేయగా.. కల్వకుర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ సుభాషిణి ప్రారంభించి మాట్లాడారు. బస్టాండులో ప్రయాణికులకు తగిన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఆర్టీసీ సిబ్బంది జగదీశ్వర్ ఉన్నారు.

అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ


కడ్తాల్: రైతుల వివరాలు సేకరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ఇంటింటి సర్వేలో వ్యవసాయ అధికారులు

కడ్తాల్: రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణ అనంతరం అర్హులైన ప్రతీ ఒక్క రైతుకు ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని ఏడీఏ ఆదిలక్ష్మీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏఓ శ్రీలత ఆధ్వర్యంలో రుణమాఫీ కాని రైతుల వివరాలను సేకరించారు. ప్రత్యేకంగా రూపొందించిన రుణయాప్‌లో పొందుపర్చారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ.. రుణమాఫీలో భాగంగా ఆధార్, బ్యాంక్ అకౌంటులో పేరు వేరుగా ఉండి లబ్ధిపొందని వారు.. రుణం తీసుకున్న బ్యాంకును సంప్రదించాలని సూచించారు. దీనికి సంబంధించిన ఆధార్ సవరణ చేసే అధికారం.. ప్రభుత్వం బ్యాంకులకు కల్పించిందని చెప్పారు. ఈ నెల 6వ తేదిలోగా బ్యాంకులకు వెళ్లి సరిచేయించుకోవాలని వెల్లడించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు అభినవ్, రమేశ్, కేదార్‌సింగ్, వందన ఉన్నారు.

ఆందోళన వద్దు


ఆమనగల్లు: మేడిగడ్డతండాలో దరఖాస్తులు స్వీకరిస్తున్న వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు: రుణమాఫీ విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సాంకేతిక కారణాలతో లబ్ధిపొందని వారు కుటుంబ నిర్ధారణ సర్వేకు వచ్చే అధికారులకు సహకరించాలని సూచించారు. మంగళవారం ఆయన మండల పరిధి మేడిగడ్డతండా, శంకరకొండతండాల్లో సర్వే చేశారు. ఈ సందర్భంగా రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఏఈఓలు ప్రభావతి, నిఖిత, భూదేవి ఉన్నారు.

మాడ్గులలో..

మాడ్గుల: రుణమాఫీ విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని, అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఏఓ అరుణ కుమారి అన్నారు. కలకొండ, చంద్రయన్ పల్లి, అవురుపల్లిలో ఆమె రేషన్ కార్డు లేని రైతు కుటుంబాల నిర్ధారణ సర్వే చేశారు. వారి వివరాలను సేకరించారు. కార్యక్రమంలో అధికారులు రాజేష్, వాహిని, భార్గవి, ప్రియాంక, మాజీ సర్పంచ్‌లు రవీందర్ రెడ్డి, యాదిరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.30వేలు పరిహారం ఇవ్వాలి

తలకొండపల్లి: భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేల పరిహారం చెల్లించాలని బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ అనిల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో తలకొండపల్లి మండలంతో పాటు, మాడ్గుల్, ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో మొక్కజొన్న, పత్తి, వరి, జొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఈ నాలుగు మండలాల్లో సుమారు 30 వేల ఎకరాల వరకు పంట నష్టం జరిగిందని, వ్యవసాయ అధికారులచే ప్రభుత్వం పంట నష్టం సర్వే చేయించి, తగిన నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

ఉద్యమకారులకు ఇంటి స్థలం కేటాయించండి

యాచారం: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఇంటి స్థలాలు కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫోరం రాష్ట్ర కమిటీ చిక్కుడు గుండాల ఆధ్వర్యంలో ఆర్‌ఐ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యమకారులకు 200 గజాల ఇంటి స్థలం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అదే విధంగా సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా అధ్యక్షుడు కొంతం యాదగిరిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బోసుపల్లి విరేష్‌కుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు దుగ్గని శ్యామల, నాయకులు ముదిగొండ అజయ్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

8న ఉచిత గుండె చికిత్స శిబిరం

ఆమనగల్లు: ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 8న కల్వకుర్తి పట్టణంలోని ప్రశాంత్ క్లినిక్ ఆవరణలో మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచితంగా గుండె చికిత్స శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు లయన్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, పీఆర్‌ఓ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో ఉచితంగా ఈసీజీ, 2డీఈకో పరీక్షలు జరపనున్నట్లు పేర్కొన్నారు.

రాయపోల్‌లో కుక్కల బెడద


రోడ్డుపై కుక్కల గుంపు

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామ సింహాలంటే గతంలో విశ్వాసం గల జంతువులు అని ప్రజల్లో నమ్మకం ఉండేది. కానీ ప్రస్తుతం మృత్యు సింహాలుగా మారి.. వారిని గుర్రుగా చూస్తుండటంతో భయపడుతున్నారు. గుంపులు గుంపులుగా సంచరిస్తూ.. అకారణంగా దాడికి పాల్పడుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో గతంలో శ్రీకాంత్ అనే బాలుడు కుక్కల దాడిలో మృతి చెందిన విషయం తెలిసిందే. అదే గ్రామంలో ప్రస్తుతం పదుల సంఖ్యలో కుక్కలు గుంపులుగా తిరుగుతుండటం ప్రజలను ఆందోళనకు గురిచేస్తుంది. ఈ సందర్భంగా గ్రామస్తులు పలువురు మాట్లాడుతూ.. కుక్కల బెడద నుంచి రక్షించాలని కోరుతున్నారు.

‘ఆశ’లను పర్మినెంట్ చేయాలి


వైద్యాధికారి రాజ్యలక్ష్మీకి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశ వర్కర్లు

యాచారం: ప్రజారోగ్యం గురించి పరితపించే ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆశలతో కలిసి యాచారం సీహెచ్‌సీ వైద్యాధికారి రాజ్యలక్ష్మీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.బ్రహ్మయ్య మాట్లాడుతూ.. ఆశలను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించి, నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల సంఘం శ్రేణులు ముక్తబాయి, స్వరూప, శోభ, బాలమణి, నాగమణి, అలివేలు, స్వరూపరాణి, లక్ష్మీ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు


ఎంపీతో అనంతరెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు

ఆమనగల్లు: నల్లగొండ పార్లమెంటు సభ్యుడు రఘువీరా రెడ్డిని మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పలువురు కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సత్కరించారు. ఆయనను కలిసిన వారిలో పార్టీ నాయకులు జగన్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

మంచాల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటూ.. ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ బాల శంకర్ అన్నారు. మంగళవారం మండల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వైద్య, పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో ఆయన మాట్లాడారు. అపరిశుభ్రతతో గ్రామాల్లో ఈగలు, దోమలు పెరిగిపోయాయని, ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా వారిలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఆరుట్ల, మంచాల ప్రభుత్వ వైద్యశాలల వైద్యులు దీప్తి, శ్రావణ్‌కుమార్, వివిధ గ్రామాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

నియామకం

మంచాల: మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చెన్నారెడ్డి గూడ గ్రామ చీఫ్ ప్రమోటర్‌గా పిడుగు పరమేష్‌ను మంగళవారం ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆ శాఖ జిల్లా అధికారులు నియామక పత్రం అందజేశారు. ఇందులో సంఘం జిల్లా అడహక్ కమిటీ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు శ్రీనివాస్, యాదగిరి ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు ముమ్మరం


ఓ కాలనీలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న జీపీ సిబ్బంది

కడ్తాల్: ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు జీపీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. పారిశుద్ధ్య కార్మికులచే మండల కేంద్రంలోని పలు కాలనీల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశారు. సీజనల్ వ్యాధులు ముసరకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నారు. మంగళవారం పలు కాలనీలో వీధులు, రోడ్లను శుభ్రం చేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లగా.. ఆ పనులను మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి పరిశీలించారు. ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో వ్యర్థాలు వేయరాదని, మురుగు నీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు.

పార్టీని బలోపేతం చేయండి


సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కమలనాథులు

బీజేపీ నాయకులు

కడ్తాల్: సభ్యత్వ నమోదును పెంచి, పార్టీని మరింత బలోపేతం చేయాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్‌నాయక్, జిల్లా అధికార ప్రతినిధి వీరయ్య అన్నారు. మంగళవారం మండల పరిధి మైసిగండి గ్రామంలో ఎస్వీ నాయక్ గార్డెన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు మాన్యనాయక్ అధ్యక్షతన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ అవతరించిందన్నారు. కమలనాథులు ఇంటింటికీ తిరిగి.. కేంద్రంలోని సర్కారు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సంక్షేమాభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. దాంతో పాటే పార్టీ సిద్ధాంతాల గురించి వివరించి, సభ్యత్వం పొందేలా చూడాలని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు సాయిలాల్ నాయక్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భగీరథ్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరయ్య, జిల్లా నాయకులు రవీందర్‌రెడ్డి, డాక్టర్ రమేశ్‌అయ్యగార్, బీసీమోర్చా మండల అధ్యక్షుడు శ్రీశైలంగౌడ్, నాయకులు లక్ష్మణ్ నాయక్, అశోక్‌రెడ్డి, మహేశ్, ఈర్లపల్లి శేఖర్, సాయిలు, జంగం వెంకటేశ్, నరేందర్ ఉన్నారు.